క్లుప్తంగా

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పొదిలి: కర్నూలు రోడ్డులోని శ్రీవీరిశెట్టి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షల తీరును కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం దర్శి డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డితో మాట్లాడారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేందుకు కృషి చేయాలని చెప్పారు. కలెక్టర్ వెంట సీఐ సుధాకర్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎస్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

తగ్గిన కంది దిగుబడి

కురిచేడు: కంది పంటలో ఈ ఏడాది ఖరీఫ్‌లో దిగుబడి చాలా తగ్గిందని మండల వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు తెలిపారు. మండలంలోని పలుచోట్ల శుక్రవారం ఆయన గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రయోగాలు చేయించినట్లు తెలిపారు. ఒక్కో ప్రయోగానికి 98-78 కిలోల వరకు దిగుబడి నమోదైందన్నారు. మండలానికి వచ్చిన ఫీల్డ్ సూపర్‌వైజర్ రవీంద్ర ఆధ్వర్యంలో పంట దిగుబడి ప్రయోగాలు చేసి నివేదికను ప్రభుత్వానికి, బీమా కంపెనీకి పంపినట్లు చెప్పారు. మాండూస్ తుఫాన్, సకాలంలో వర్షాలు పడకపోవటం, వాతావరణ పరిస్థితులతో దిగుబడి తగ్గిందని పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ఉచిత ప్రవేశాలకు 2023-24 సంబంధించి ఒకటో తరగతికి ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు తెలిపారు. htt p://c.rc.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం నమోదు చేయాలన్నారు. బేస్తవారిపేట మండలంలో కావ్య హైస్కూల్, యశ్వంత్ హైస్కూల్, శ్రీ సాయి అక్షర ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు.

అకాల వర్షంతో రైతుల ఆందోళన



తాళ్లూరులో పరదాలతో కప్పిన మిరప కాయలు

తాళ్లూరు: ద్రోణి ప్రభావంతో శుక్రవారం తెల్లవారు జాము నుంచి మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం వేళ కొంత తెరప ఇవ్వడంతో రైతులు తమ పంటలను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. మళ్లీ సాయంత్రం వేళ వర్షం కురిసింది. ఓ మోస్తరు వర్షాలతో ఇబ్బందులు ఉండవని, వరుసగా మూడు, నాలుగు రోజులు వర్షం పడితే నష్టాలు తప్పవని రైతులు చెబుతున్నారు. మిరప, గోధుములు, శనగ వంటి ధాన్యపు రాసులను ప్లాస్టిక్ పరదాలతో కప్పి తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

కురిచేడు: ఎండలు పెరగటంతో పాటు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య ఆధ్వర్యంలో డ్రైనేజీల్లో పూడికతీత పనులు ముమ్మరం చేశారు. బ్లీచింగ్ పిచికారీ చేస్తున్నారు. వైద్యాధికారి ప్రవీణ్ తన సిబ్బందితో ఇంటింటికీ జ్వరాల సర్వే చేయిస్తున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా వుండాలని, దోమ తెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు లాంటి వాటిని ధ్వంసం చేయాలని వైద్యాధికారి సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

గ్రామాలకు సాగర్ జలాలు

- మంత్రి చొరవతో కదిలిన అధికారులు
- తీరనున్న తాగునీటి కష్టాలు



సి.కొత్తపల్లిలో సాగర్ నీరు పట్టుకుంటున్న మహిళ

పుల్లలచెరువు: నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టి సారించడంతో సాగర్ జలాలు అందుతున్నాయి. పుల్లలచెరువు మండల ప్రజలు నీటి సమస్యపై ఇటీవల అధికారుల ఎదుట నిరసన తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి సురేష్ సంబంధిత అధికారులను ఆదేశించడంతో తక్షణ చర్యలు చేపట్టారు. ముటుకుల గ్రామంలోని ఎస్ఎస్ ట్యాంక్ నుంచి సాగర్ నీటిని గ్రామాలకు చేర్చేందుకు చర్యలు చేపట్టారు. పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టి గత వారం రోజులుగా పలు గ్రామాలకు నీరు అందిస్తున్నారు. శుక్రవారం చాపల మడుగు, సి.కొత్తపల్లి వరకు సాగర్ జలాలను అందించారు. చాలా వరకు నీటి సమస్య పరిష్కారం అయిందని అధికారులు తెలిపారు. త్వరలోనే మురారిపల్లి గ్రామం వద్ద సంపు నిర్మాణం చేపట్టి ఆ పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా సాగర్ జలాలు సరఫరా చేస్తామని అధికారులు మంత్రికి వివరించారు. అవసరమైన చోట కొత్తగా బోర్ల నిర్మాణానికి తన నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రజలకు ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు.

బుడ్డపల్లిలో వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



హాజరైన భక్తులు

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లిలో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత రామచంద్ర స్వామి నూతన జీవ ధ్వజ శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవం, మహా కుంభాభిషేకాన్ని శుక్రవారం గ్రామస్తులు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగాయి. శుక్రవారం ఉదయం ప్రతిష్ట హోమాలు, శాంతి హోమాలు, విగ్రహ ప్రతిష్ట గోపుర శిఖర కలశ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, ధ్వజ స్తంభ ప్రతిష్ట జరిగింది. అర్చకులు ఉప్పల ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో ఓరుగంటి సీతారామ శర్మ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అల్లూ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ అల్లూ వెంకటరెడ్డి ధ్వజ స్తంభాన్ని అందించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నవితరణ జరిగింది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పిడుగుపాటు మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

యర్రగొండపాలెం: పిడుగుపాటుకు మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వపరంగా అధికారులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని గోళ్లవిడిపి గ్రామంలో గురువారం కురిసిన వర్షాలతోపాటు పిడుగుపడింది. ఈ ఘటనలో ఆ గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వర్లు మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలను, ఆ గ్రామానికి చెందిన ఎంపీటీసీలు రూ.5 వేలను మృతుడి భార్య కాశమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఈఓపీఆర్డీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ పి.పద్మ, ఏపీఎం ఎం.వెంకిరెడ్డి పాల్గొన్నారు.

సంగ్రామ యాత్రలు విజయవంతం చేయాలి



పాదయాత్ర చేస్తున్న నాయకులు

బేస్తవారిపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ తొరటి ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద ఓబినేనిపల్లెకు సంగ్రామ యాత్ర చేరింది. బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందని, భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు పులిగుజ్జు ఫ్రాంక్లిన్, జిల్లా ఎమ్మార్పీస్ కన్వీనర్ ప్రకాష్, నాయకులు పందిటి కాశీరావు, జలదంకి నరసింహ, కోటయ్య, బాబూరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విజ్ఞాన సామర్థ్యం పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శామ్యూల్‌జాన్

పుల్లలచెరువు: విద్యార్థులు కనీసం పాఠాల పేర్లు కూడా చెప్పలేకపోతున్నారు, వారి విజ్ఞాన సామర్థ్యాన్ని పెంచాలని ఎంఈఓ శామ్యూల్‌జాన్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం కొత్తూరు పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం రికార్డులు, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్‌ను పరిశీలించి సూచనలిచ్చారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలని చెప్పారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి సహాయం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద గాలి నాసరయ్యకు రూ.1.20 లక్షలు, మద్దెల తులసికి రూ.40 వేల చెక్కు అందించారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. కొండయ్య, మందటి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి



చెవిరెడ్డితో గోన రంజీత్‌కుమార్

గిద్దలూరు రూరల్: క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని క్రిస్టియన్ మైనార్టీల జిల్లా అధ్యక్షుడు గోన రంజీత్ కుమార్ అన్నారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిద జాన్సన్ అధ్యక్షతన తాడేపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి రాష్ట్రంలోని అన్ని సంఘాల అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో బదిలీలు పూర్తి చేయాలి

మార్కాపురం: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ప్రభుత్వం వేసవిలో పూర్తి చేయాలని వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రపుసాల చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. 1998 డీఎస్సీ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో నియామక ఉత్తర్వులు జారీ చేసినందుకు ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలిపారు. జీఓ నంబర్ 27 ద్వారా 4534 మందికి ఉద్యోగాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకుంటారన్నారు.

మూడో విడత ఆసరా లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారుల జాబితా అందిస్తున్న ఏపీఎం రమేష్

మార్కాపురం: వైఎస్సార్ 3వ విడత ఆసరా పథకం కింద అర్హులైన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి సచివాలయాల్లో డిస్‌ప్లే చేస్తునట్లు ఏపీఎం రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 5 వరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయాల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో 3వ విడత ఆసరాను ప్రారంభించనునట్లు తెలిపారు. బ్యాంకు రుణాల ద్వారా గేదెలు, పొట్టేళ్ల యూనిట్లు స్థాపించుకోవచ్చని తెలిపారు. ఇంకా అర్హత ఉండి పథకం రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కెనర బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్, వెలుగు సీసీ మనోకుమారి పాల్గొన్నారు.

భారత్ బ్రాండ్ పేరుతో ఎరువుల సరఫరా

తాళ్లూరు: అన్ని రకాల కాంప్లెక్స్, యూరియా ఎరువులు ఇక నుంచి భారత్ బ్రాండ్ పేరుతో సరఫరా అవుతాయని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మల్కాపురం ఆర్‌బీకేలో శుక్రవారం ఆయన రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఎరువుల బస్తాపై సైతం ప్రభుత్వం ఇస్తున్న రాయితీల వివరాలు ఉంటాయన్నారు. సర్పంచి వలి, ఎంపీటీసీ ఎం.వెంకట రామిరెడ్డి, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డి గెలుపుపై హర్షం

మార్కాపురం టౌన్: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపుపై బహుజన టీచర్స్ అసోసియేషన్ (అమరావతి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మావులూరి సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆయన విజయానికి కృషి చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఎమ్మెల్సీ కల్పలతరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని ఒంగోలు క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వీ శ్రీధర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు మినహా ఇతరులు ఎవరూ లోపలికి అనుమతి లేదన్నారు. ఉద్దేశ పూర్వకంగా ఆటంకం కలిగిస్తే తక్షణమే అధికారులకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ సంపత్‌కుమార్, సిబ్బంది అంజిబాబు, ఎస్.కృష్ణయ్య, ధనలక్ష్మి, అనూషా ఉన్నారు.

జేపీవీ పథకం విజయవంతానికి కృషి చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాబూరావు

తాళ్లూరు: జగనన్న పాల వెల్లువ పథకం విజయవంతానికి గ్రామైఖ్య పొదుపు సంఘ సభ్యులు కృషి చెయ్యాలని డీఆర్‌డీఏ పీడీ బి.బాబూరావు కోరారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం వీఓఏ సంఘ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ మాట్లాడుతూ గ్రామాల్లో వలంటీర్లు, సొసైటీ ప్రమోటర్లు, మిల్క్ బూత్ సెక్రటరీలు, పొదుపు సంఘ సభ్యులు తప్పనిసరిగా జేపీవీ కేంద్రాల్లో పాలు పోసేలా చూడాలని కోరారు. ఎంపీడీఓ కేవై కీర్తి మాట్లాడుతూ జేపీవీ కేంద్రాల్లో పాలు పొయ్యకుండా, సహకరించని వలంటీర్ల నంబర్లు తమకు తెలిపాలని, ప్రతి మిల్క్ బూత్ సెక్రటరీ బాధ్యతగా కేంద్రం అభివృద్ధికి సహకరించాలని కోరారు. శివరామపురం, దారంవారిపాలెం, విఠలాపురం, నాగంబొట్లపాలెం, తూర్పుగంగవరం, రమణాలవారిపాలెం గ్రామాల వారీగా జేపీవీ కేంద్రాల పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. బొద్దికూరపాడు, అయ్యలపాలెం, లక్కవరం, దోసకాయలపాడు, తోట వెంగన్నపాలెం, బెల్లంకొండవారి పాలెం, మన్నేపల్లి, తురకపాలెం, మల్కాపురం గ్రామాల్లో ఈ నెల 21లోపు నూతన జేపీవీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పీడీ బాబూరావు ఆదేశించారు. ఏపీఎం దేవరాజ్, పశువైద్యాధికారి ప్రతాప్‌కుమార్, స్త్రీ నిధి క్లస్టర్ మేనేజర్ పవన్ కళ్యాణి, సీసీలు సురేంద్రనాథ్, కోటేశ్వరమ్మ, సీఓ వి.కుమారి పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన దూడలు

- పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి



బహుమతులు అందజేస్తున్న జేడీ బేబిరాణి

పొదిలి: కృత్రిమ గర్భధారణతో మేలైన దూడలు పొందవచ్చని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బేబిరాణి చెప్పారు. నగర పంచాయతీ పరిధి కాటూరివారిపాలెంలో శుక్రవారం గర్భధారణతో మేలు జాతి దూడల ప్రదర్శన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బేబీరాణి మాట్లాడుతూ పుట్టిన ఆడదూడలను మూడేళ్ల పాటు సంరక్షించుకుంటే మంచి పాడి గేదెలు అవుతాయన్నారు. పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుందన్నారు. రైతులు ముందుగా రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్య నిర్వహణాధికారి డాక్టర్ కాలేషా మాట్లాడుతూ లేగ దూడల ప్రదర్శనతో జాతి లక్షణాలపై రైతులకు అవగాహన కలుగుతుందన్నారు. దూడలు సంరక్షించుకుంటున్న రైతులకు ప్రోత్సాహక బహుమతులు బేబిరాణి చేతుల మీదుగా అందజేశారు. పొదిలి సహాయ సంచాలకులు డాక్టర్ పి.వేణు, డాక్టర్ కృష్ణ మోహన్, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు ఎమర్జ్ ఉపయోగం



సావనీర్ విడుదల చేస్తున్న ఆనందరావు, వెంకటరెడ్డి

- రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆనందరావు

మార్కాపురం టౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సాంకేతిక సదస్సు ఉపయోగపడుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనందరావు అన్నారు. శుక్రవారం డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజినీరింగ్ కళాశాలలో 17వ టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఎమర్జ్ 2023ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆనందరావు మాట్లాడుతూ ఇటువంటి సదస్సు నాలెడ్జ్ ఎక్స్‌ఛేంజ్‌కు ఉపయోగపడుతుందన్నారు. 17 ఏళ్లుగా ఇలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమని జేఎన్‌టీయూ కాకినాడ డైరెక్టర్, ఇంక్యూబిషన్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ వెంకటరెడ్డి అన్నారు. అనంతరం సావనీర్ విడుదల చేశారు. జార్జ్ కళాశాల యాజమాన్యాన్ని ప్రసంశించారు. సదస్సులో కన్వీనర్ డాక్టర్ సాధునాయక్ ఎమర్జ్ రిపోర్ట్‌ను ప్రజెంట్ చేశారు. సుమారు 200 పేపర్ ప్రజెంటేషన్‌లు, 50 పోస్టర్లు రిజిస్టరైనట్లు చెప్పారు. జడ్జిలుగా డాక్టర్ తిరుపతిరెడ్డి, ఆర్‌జీఎం నంద్యాల డాక్టర్ బల్లా సత్యనారాయణ, ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ ఫకీరప్పా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకాడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, ఈఈఈ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో భారీగా పంట నష్టం



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏఓ నీరజ



త్రిపురాంతకం వద్ద అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న

త్రిపురాంతకం: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు శుక్రవారం పరిశీలించారు. మేడపి, ఎండూరివారిపాలెం గ్రామాల్లో మినుము 250 ఎకరాలు, పెసర 100 ఎకరాలు, పత్తి 450 ఎకరాలు, మొక్కజొన్న 50 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారి కె.నీరజ తెలిపారు. పంట నష్టాల ప్రాథమిక నివేదికలను తయారు చేసి ఆర్బీకేల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు నీరజ తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.